ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH
Sunday , September 23, 2007

తానా చొరవతో

# ఆస్టిన్ విశ్వవిద్యాలయంలో తెలుగుబోధన ప్రారంభం



అమెరికాలోని ఆస్టిన్ విశ్వవిద్యాలయంలో తెలుగుబోధనను ప్రారంభించారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(తానా) చొరవతో ప్రారంభమైన ఈ కోర్సుకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించడం గమనార్హం. ఈ విశ్వవిద్యాలయంలో ఇప్పటికే తమిళం, మళయాళం ... తదితర దక్షిణాది భాషలను బోధిస్తున్నారు. తొలి సెమిస్టర్‌లో పదహారుమంది విద్యార్థులు తెలుగుభాషను ఒక కోర్సుగా తీసుకున్నారు. హిందీ, ఉర్దూ భాషలకు మాత్రమే పెద్దసంఖ్యలో విద్యార్థులుండగా ఆ రికార్డుని తెలుగు భాష చేరుకోవడం విశేషం. తెలుగుభాష బోధనా ప్రారంభం ఒక మంచిపరిణామమని అయితే స్థానిక తెలుగు సంస్థలు మరింత ప్రోత్సాహం చూపితే తెలుగును అభ్యసించే వారి సంఖ్య మరింత పెరుగుతుందని ఆసియా అధ్యయన విభాగ ఛైర్మన్ ప్రొఫెసర్ జోల్‌బ్రెర్టన్ అన్నారు.

తెలుగుదేశంలో ఉన్నట్లే...

మాతృభాషను మరిచిపోతామన్న భావనలో ఉన్న తమకు తెలుగు నేర్చుకునే అవకాశం రావడం ఎంతో సంతోషం కలిగించిందని తెలుగువిద్యార్థులు అన్నారు. మాతృభూమికి దూరంగా ఉన్న సమయంలో మాతృభాష అధ్యయనం ద్వారా తెలుగుభాష,సంస్కృతిపై ఆసక్తి పెరుగుతుందని వారు అన్నారు. ఆస్టిన్ తెలుగు తరగతిలో కూర్చుంటే తెలుగుదేశంలో ఉన్నట్టే ఉందని అనుపమ అట్లూరు తెలిపింది. తెలుగు రాయడం కష్టమని భావిస్తున్న దశలో తెలుగు తరగతిలో కూర్చున్నాక ఆ అభిప్రాయం మార్చుకున్నానని మరో విద్యార్థిని దీపికా ముత్యాల తన అభిప్రాయం వ్యక్తం చేసింది. తరగతిలో చేరిన మొదటి వారంలోనే సంభాషణలు జరిపే స్థాయికి చేరుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని బ్రైన్ రాబిన్‌సన్ అన్నారు. తెలుగు పాఠం విన్నాక కచ్చితంగా తెలుగును నేర్చుకోవాలన్న ఉత్సాహం వచ్చిందని జానూచావ్లా తెలిపింది. తెలుగు సంస్కృతి, సాహిత్యం తమకు ఆసక్తికరమైన అంశాలని హర్ష శ్రీనివాస్ అన్నారు. భారత ప్రభుత్వం నుంచి భాషా సమ్మాన్ అవార్డు అందుకున్న డాక్టర్ అఫ్సర్ తెలుగుబోధనకు నేతృత్వం వహించడం విశేషం, తెలుగు గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన పత్రాలను ఆయన సమర్పించారు. ఆస్టిన్‌లో తెలుగుభాషను బోధించడంపై 'తానా' మాజీ అధ్యక్షుడు డాక్టర్ బండ్ల హనుమయ్య హర్షం వ్యక్తం చేశారు. అమెరికాలోని మంచి విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా పేరొందిన ఆస్టిన్‌లో తెలుగు కోర్సు ప్రారంభించడానికి తానా ఎనలేని కృషి చేసిందని 'తానా'అధ్యక్షుడు ప్రభాకరచౌదరి కాకరాల తెలిపారు. మొదటి సెమిస్టర్‌తో ప్రారంభమైన తెలుగుకోర్సును అడ్వాన్స్‌డ్ స్థాయివరకూ ఎదగడానికి డల్లాస్, ఆస్టిన్, హ్యూస్టన్, శాన్ ఆంటోనియో వంటి పెద్ద నగరాలలోన్ని తెలుగువారు కలసికట్టుగా కృషి చేయాలని ఆస్టిన్-తెలుగు కమిటీ ఛైర్మన్ ప్రసాద్ తోటకూర తన ప్రసంగంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శాన్ ఆంటోనియో తెలుగుసంఘం తరఫున మాధవరావు గోవిందరాజు, ఆస్టిన్ నుంచి ఎస్.ఎన్.రావు, డల్లాస్ నుంచి రామ్ యలమంచిలి తమ ప్రోత్సాహాన్ని అందించారని తోటకూర పేర్కొన్నారు. సాధారణంగా అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో భారత్ అంటే కేవలం ఉత్తరభారతమని అనుకునేధోరణి ఉంది. కానీ టెక్సాస్‌లో మాత్రం ఎక్కువగా దక్షిణ భారతానికి చెందిన విద్యార్థులు ఉండటం విశేషం. ఆసియా అధ్యయన శాఖ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఎక్కువగా దక్షిణ భారతంపై ప్రసంగాలు, చర్చాగోష్ఠులు నిర్వహిస్తుండటంతో ఆ ప్రాంగణం దక్షిణాది విద్యార్థులకు ఒక కేంద్రంగా మారింది.